# చివరకు మిగిలింది!

ఊరంకి వెంకటరావు



ఆ రోజు ఉదయం లేచిన దగ్గరనుంచీ సుబ్బమ్మగారు ఊరికే త్రొక్కిసలాడి పోతోంది. ప్రక్కమీద నుంచి లేవడమే అమె ఎంతో ఆవేశంతో, ఉత్సాహంతో, సంబరంతో లేచింది. నిజానికి ఆమెకూ, ఆమె భర్త చిదంబరంగారికీ ఆ రోజు అటువంటిదే. జీవితం యించుమించు చరమాంకానికి చేరుకునే సమయంలో, అంతకు ముందెన్నడూ వారి జీవితాలకు, వారి సేవలకు, వారి ప్రజ్ఞాపాటవాలకు లేని గుర్తింపు ఒక్కసారిగా తమ పట్టణంలో జరిగి, ఆ గుర్తింపుకు చిహ్నంగా బహిరంగంగా సన్మానం జరుగుతోందంటే, సుబ్బమ్మగారికే కాదు ఆమె స్థానంలో వున్న ఎవరికైనా అలాగే వుంటుంది.

సుబ్బమ్మగారు మంచం దిగగానే చిదంబరంగారి మంచం దగ్గిర కాళ్ళ వైపు నిలపడి తన భర్తను తనివితీరా గర్వంగా చూసింది. ఆమె వంగి ఆయన పాదాలను స్పృశించి నమస్కారం చేసింది. ఆ పని ఆమె కాపరానికి వచ్చిన నలభై ఏళ్ళలోనూ ఎన్నడూ చెయ్యనిది గనుక, ఆమె పని ఆమెకే ఎబ్బెట్టుగా, విపరీతంగా తోచి, ఎవరైనా చూస్తారేమోనని గదిలోను చుట్టుపక్కలా చూసింది. ఎవరూ చూడలేదని సంతృప్తి చెంది ఆ తర్వాత మంగళసూత్రాలు కళ్ళకద్దుకొని వంటింట్లో వున్న దేవుడి పీటదగ్గరికి వెళ్ళి అక్కడవున్న దేవుడు విగ్రహాలకూ, పటాలకూ, అన్నిటికీ భక్తితో నమస్కరించింది. ఆనాటి తమ కార్యక్రమం దిగ్విజయం చేయమని, అందరి మూర్తులనూ ప్రార్థించింది. ఆ తర్వాత వెళ్ళి తన భర్తను లేపింది— 'ఏమండీ, లెండి, యీ వేళ చాలా పనులున్నాయి. త్వరగా తెమలండి. సమయానికి మనం సిద్ధంగా వుండకపోతే బాగుండదు,' అంటూ.

తన భర్తకు షష్ఠిపూర్తి సన్మానం చెయ్యడానికి పట్టణంలో పెద్దలు తలపెట్టినారని తెలిసిన దగ్గరనుంచీ సుబ్బమ్మగారు ఊహాలోకంలోనే విహరిస్తూవుంది. సన్మాన సమయం సమీపిస్తూన్నకొద్దీ అమెకు రాత్రిళ్ళు నిద్రపట్టడమే లేదు. సన్మానం అంటే ఏమిటో, ఎలా చేస్తారో తన భర్త విషయంలో ఆ ఊరివాళ్ళు, తన భర్త పూర్వ విద్యార్థులూ, సమకాలీనులూ ఎలా చెయ్యదలుచుకున్నారో అన్న ఆమె చిదంబరంగారిని తరుచుగా అడిగేది. ఆయనేదో ముభావంగా ముక్తసరిగా 'ఏమోనే, ఎలా చేస్తారో, ఘనంగా చెయ్యాలంటే ఘనంగా చెయ్యవచ్చు, నామ మాత్రంగా చెయ్యాలంటే అలా చెయ్యవచ్చు. ఐనా, నీ వెర్రిగాని వాళ్ళు మనతో చెప్పి చేస్తారుటే! వాళ్ళు ఎలా చేసినా మనం సంతోషించవలసిందే; ఒప్పుకోవలసిందే' అన్నాడు. ఆయన సమాధానం ఆవిడకు తృప్తి కలిగించలేదు, ఆమె ఆశించిన స్థాయిలో చిదంబరంగారి సమాధానం లేదు. ఆయన తనకు చెప్పకుండా ఏదో దాచిపెడుతున్నాడని ఆమె అనుమానించింది.

ఇక వారం రోజులలో షష్ఠిపూర్తి సన్మానం జరుగుతుందనగా ఒకనాటి చిదంబరంగారి శిష్యుడూ, ప్రస్తుతం హైస్కూలులో ఉపధ్యాయుడూ, షష్ఠిపూర్తి సన్మాన కమిటీ కార్యదర్శి అయిన నాగరాజు ఆ వీధివెంట స్కూలు నించి వెడుతూవుంటే, సుబ్బమ్మగారు పనిగట్టుకొని కాచుకుని కూర్చొని, 'బాబూ నాగరాజూ ఓమాటిలా వస్తావా' అని పిలిచింది. 'అయ్యో దొడ్డమ్మగారూ ఎంతమాటన్నారు! నేనే రెండు, మూడు రోజులలో మీ యింటికి వచ్చి జరుగుతున్న ఏర్పాట్లూ, విశేషాలు మీతోను, మేష్టరుగారితోను చెబుదా మనుకుంటున్నాను; యింతలోకి మీరే పిల్చారు' అంటూ వెళ్లాడు. సుబ్బమ్మగారు నాగరాజు కెంత మంది పిల్లలో, వాళ్లేంచేస్తున్నారో, నాగరాజు భార్య నీళ్ళాడి ఎన్నా

ళ్ళయిందో వగైరా ప్రశ్నలన్నీ వేసి, యోగక్షేమాల ప్రస్తావనానంతరం సన్మాన ప్రసంశ తెచ్చింది. నాగరాజు తమ గురువుగారికి షష్ఠిపూర్తి సన్మానం ఏ విధంగా జరపదలచిందీ, కార్యక్రమం వివరాలన్నీ విపులంగా చెప్పి, ఆరువేల రూపాయలు పర్సు యివ్వడానికి నిశ్చయించినట్టూ, అందుకోసం విరాళాలు సేకరిస్తున్నట్లూ చెప్పాడు. చిదంబరంగారి దగ్గర చదువుకొని, మంచి ఉద్యోగాలలో వున్న పూర్వవిద్యార్థుల నించి విరాళాలు మనియార్డర్లుగాను, చెక్కుల రూపంలోను వస్తున్నట్లుగా కూడా నాగరాజు చెప్పాడు.

ఆరువేల రూపాయలు తన భర్తకు పర్సుగా యివ్వబోతున్నారనే వార్త విని సుబ్బమ్మగారు తన చెవులను తానే నమ్మలేకపోయింది ఆమె. 'నిజంగానే యిస్తారా?' అని అడగబోయి నిగ్రహించుకొని మానేసింది. ఆరువేల రూపాయల పర్సు తమకు యివ్వబోతున్నారనే మాట చెవినపడిన క్షణంనించీ సుబ్బమ్మగారు సుబ్బమ్మగారిలా లేదు. ఆమె ఊహాలోకాల్లోనే విహరించడం ఆరంభించింది. తన భర్త ముప్పైయ్యయిదు సంవత్సరాలు హైస్కూలు మేస్టరుగా పని చేసినా, తమది చిన్న సంసారమే ఐనా ఆరువేల రూపాయలు నిలవచెయ్యడం గాని, ఒక్కసారి అంత డబ్బు తను చూడడం గాని ఎన్నడూ జరగలేదు. తమకు లభించబోయే ఆరువేల రూపాయలతో రెండు, మూడు పట్టుచీరలు కొనుక్కొని, రెండు జతల గాజులూ, కాసులపేరో, పలకసర్లో చేయించుకోవా లనుకుంది. ఇంకా డబ్బు మిగిలితే దక్షిణదేశంలోని యాత్రాస్థలాలన్నీ దర్శించాలనుకుంది. ఆ డబ్బుతో చిన్న యిల్లు కొనాలనుకుంది. ఆ ఆరువేల రూపాయలకే అరవై ఆరువేల రూపాయల పథకాలు అలోచించింది సుబ్బమ్మగారు. ఆమె ఊహాలోకాల్లో ఉండగానే నాగరాజు సెలవు తీసుకొన్నాడు.

ఆ రోజునించీ సుబ్బమ్మగారు చిదంబరంగారిని తను నలభైసంవత్సరాలు కాపురంచేసిన పాతచిదంబరంగారిలా చూడలేదు. ఆయన్ని మానవాతీతుడుగా, దైవ సమానుడిగా చూసింది. అంతకు ముందు నిత్యకృత్యాల్లో ఆయన ఏమేమి సమకూర్చాలో, అవేమీ ఎన్నడూ పట్టించుకోని మనిషి, ఆయన ప్రతి చిన్న అవసరాన్నీ అతిశ్రద్ధగా కనిపెట్టి, ఆయన కదిలితే కందిపోతాడేమో నన్నట్లుగా అన్ని పరిచర్యలూ చేయడం మొదలుపెట్టింది. చిదంబరంగారికి తన భార్య ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయనకు తావెవరో కొత్త మనిషితో కాపురం చేస్తున్నట్లనిపించింది.

సుబ్బమ్మగారు ఆవీధిలో వున్న యితర గృహిణులను కూడా యిదివరకు లాగ చూడలేదు. వారితో మామూలుగా ప్రవర్తించలేదు. ఇంటింటికీ వెళ్ళి తమకు జరగబోయే షష్ఠిపూర్తి సన్మాం గురించీ, యివ్వబోయే పర్సు గురించీ చెప్పింది. ఆ డబ్బుతో తను ఏ ఏ రకాల నగలు చేయించుకోబోతున్నదో, ఎటువంటి చీరలు కొనబోతున్నదో వివరంగా చెప్పింది. కొంతమందిని నగల విషయంలో, చీరల విషయంలో సలహాలు కూడా చేసింది. మొత్తానికి సాటి ఆడవారి మనసులలో యీర్ష్యను రేకెత్తించే వరకూ సుబ్బమ్మగారికి సంతృప్తి కలగలేదు. సుబ్బమ్మగారికి పట్టబోయే అదృష్టాన్ని ఊహించుకొని కొందరు మహిళలు సహజంగానే అక్కసు చెందారు.

చిదంబరంగారిలో మాత్రం ఆయనకు జరిగించబోయే సన్మానపు అట్టహాసం ఏ విధమైన మార్పునూ తీసుకురాలేదు. ఆయన దానిని తలుచుకొని మురిసిపోనూలేదు; ఘనంగా జరుగుతుందో లేదోనని ఆందోళన చెందనూలేదు. ఆయనకు బాధకలిగించిదల్లా సుబ్బమ్మగారి ప్రవర్తనే. ఆవిడ యింటింటికీ వెళ్ళడం, ఆడవారందరితో సన్మానం గురించి ముచ్చటించడం ఆయనకు సుతరామూ యిష్టంలేదు అంతకు పూర్వం మాటలలోగాని, చేతలలోగాని తనకు ఏ విధమైన ప్రత్యేకతనూ, గౌరవాన్ని యివ్వకుండా, ఆప్యాయతనూ, అభిమానాన్ని చూపించకుండా తనకు పర్సు యిస్తారనే విషయం తెలిసిన దగ్గరనుంచే తనపై ఆదరాభిమానాలు కుప్పతెప్పలుగా కుమ్మరిస్తున్న సుబ్బమ్మగారి ప్రవర్తన ఆయనలో జుగుప్సను రేకెత్తించింది.

ఒక్కొక్కప్పుడు యీ సన్మానం అనే తతంగం జరగకుండా వుండినా, ఆగిపోయినా బావుండునని అనిపించిన క్షణాలు కూడా లేకపోలేదు. ముఖ్యంగా యిందుకు కారణం 'ఫలానా వారికి సన్మానం చేస్తున్నాం, మీరు చందా యివ్వండి, మీ సంఘం విరాళం యివ్వండి' అంటూ సన్మాన సంఘం సభ్యులు సంఘాధ్యక్షుడు జగన్నాయకులుగారి కొట్టు కొట్టుకీ వెళ్ళి, ప్రతి సంఘానికి కబురుచేసీ, ఒత్తిడిచేసీ అడగడమే. ఆ విధానం ఎంత సవ్యమైనప్పటికీ, ఆ విధానం తప్ప చందాలు వసూలు చేయడానికి మరోమార్గం లేనప్పటికీ, ఉన్నట్టుండి ఒక్కమారుగా తన పేరు బజారున పడడం ఆయనకు అసంతృప్తినే కలిగించింది. అంతరాంతరాలలో చిదంబరంగారికి మరొక అనుమానం కూడా లేకపోలేదు. పలుకుబడి, అధికారంవున్న పెద్దలు బయలుదేరివెళ్ళి వర్తకులనూ, తదితర సంస్థలనూ ఒత్తిడిచేసి మొగమాటపెట్టి హెచ్చు మొత్తంలోనే సొమ్ము వసూలుచేస్తారు, సన్మానానికి అయిన ఖర్చుపోను మిగిలినదంతా తనకు పర్సురూపంలో యిస్తారా? లేక ఎక్కువ మిగిలినా యిన్నాళ్లూ



అంటూ వున్న ఆ ఆరువేలే యిస్తారా? ఈ విధంగా అనుమానించడానికి ఆయనకు రెండు కారణాలున్నాయి మొదటిది—తన శిష్యుడే అయినా, మంచివాడే అయినా, తనపై ఎంతటి ప్రేమ, గౌరవాలు ప్రదర్శించే వాడైనా కార్యదర్శిగా వున్న నాగరాజు డబ్బు విషయంలో కొంత తిరకాసు మనిషని, ఒకానొక పెళ్ళి సందర్భంలో పెత్తనం వహించి డబ్బు లెక్క తేడాగా చెప్పి కొంత వెనక వేసుకొన్నాడని తను వినడం. రెండవది—సన్మాన సంఘాధ్యక్షుడైన జగన్నాయకులుగారు రాజకీయంగా, సాంఘికంగా పలుకుబడినీ, మద్దత్తునీ, అధికారాన్ని, హోదాను సంపాదించి హైస్కూలు పాలనాధికారం మొదలు, కో ఆపరేటివ్ బ్యాంకు, మార్కెటింగు సొసైటీతో సహా, పంచదార ఫ్యాక్టరీ వరకూ అన్ని సంస్థలనూ గుప్పిట్లో పెట్టుకొని వాటిని స్వంత ఎస్టేట్లుగా యధేచ్ఛగా పరిపాలిస్తుండున ఆయనను ఎవరూ ఎదిరించి, నిలదీసి అడగలేని స్థితి.

జగన్నాయకులుగారు,వారి అబ్బాయి రంగనాయకులు ఎంతటివారంటే, వారు తలపెట్టిన యీ షష్టిపూర్తి సన్మానం తనకు అక్కరలేదని తను నిరాకరిస్తే వారు తనను తన్నించైనా సన్మానానికి ఒప్పించగలరు; లేదా ఆ వూళ్లో తన కుటుంబానికి మంచినీళ్ళైనా పుట్టకుండా చెయ్యగలరు. అందువల్ల వారికి దయ కలిగినా, దయతప్పినా తాను తల ఒగ్గవలసిందేగాని, గత్యంతరం లేదు. తనకు యిష్టమైనా, లేక కష్టంకలిగినా వారు చెప్పినట్లుతను నడచుకోవలసిందే. తాను ముప్పయిఐదుసంవత్సరాలు శ్రమపడి చదువుచెప్పి జీతం తీసుకొన్నా, జగన్నాయకులుగారు గాని, వారి పూర్వీకులుగాని మేష్టర్లకు తాము దయా ధర్మ భిక్షం క్రింద జీతాలు చెల్లించినట్లేభావన కనపర్చేవారుగాని, మేష్టర్లు వారి వృత్తి ధర్మం నెరవేర్చినందుకు జీతాలు వారికి ముట్టినవనే అభిప్రాయం రానీయలేదు.

తండ్రికి జరిగే సన్మానాన్ని చూసి ఆనందించుదామనే చిదంబరం గారి ఒక్కగానొక్క కొడుకు సతీసమేతంగా మద్రాసునించి అ క్రితం రోజే వచ్చాడు. భాస్కర్రావు గుణాలకి తల్లి పోలికేగాని తండ్రిపోలికకాదు. మద్రాసులో మంచి జీతంతో పెద్ద ఉద్యోగమే వెలగబెడుతున్నా అతను తండ్రికెప్పుడు ఏమీపంపించి ఎరగడు. అతని సంసారం అతనికే భారంగా వుందంటాడు, ఏవరూ అడగక పోయినా. వాళ్ళ నాన్నగారి సంపాదన ఆయనకుసరిపోతుందంటాడు. భాస్కర్రావు వచ్చినదగ్గరనుంచీ చిరాకు పడుతూనే వున్నాడు, — ఎవరిమీదో, ఎందుకో స్పష్టంగా తేల్చకుండా. తండ్రి షష్టిపూర్తి సన్మానానికి వచ్చినందుకు తలకు దగ్గర దగ్గర నూటయాభై రూపాయలు ఖర్చుల క్రింద అయిపోయాయని తేల్చాడు చివరికి. మద్రాసులో తనకు మూడు, నాలువేల రూపాయలదాకా అప్పులున్నాయనీ తేల్చాడు—తండ్రికి

యివ్వబోయే పర్సు విషయం తెలిశాక చిదంబరంగారికి తన సుపుత్రుడిచిరాకు; సణుగుడు ఎందుకో అర్థమయాయి. సుబ్బమ్మగారు కూడా తన కొడుకు ఆంతర్యం అవగతం చేసుకొన్నాక, కొడుకు ఈ సన్మానానికి 'అంత డబ్బు తగలేసి' రాకపోతేనేం అనుకొన్నది.

సన్మానంరోజున ఉదయం చిదంబరం దంపతులకు అభ్యంగన స్నానం చేయించి, పట్టువస్త్రాలు ధరింపజేసి, బేండు, మేళంతో ముఖ్యపురవీధుల గుండా జీపులో ఊరేగించారు. జగన్నాయకులుగారు, ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటయిన సన్మాన కమిటీవారు, జగన్నాయకులుగారి జీపులో పుష్పమాలాలంకృతులై వూరేగడం సుబ్బమ్మగారికొక కొత్త వింత, అనుభవం. సాటి మేష్టర్ల భార్యలకు ఎవ్వరికీ పట్టని అదృష్టం తనకు పట్టినందుకు ఆమె చాలా గర్వించింది. ఆ రోజుసాయంత్రం బాగా అలంకరించిన వేదికపై షష్టిపూర్తి సన్మానసభ జరిగింది. వేదిక మీదికి చిదంబరం మేష్టారినీ, ఆయన భార్యనూ విద్యార్థినులు మంగళహారతులిస్తూ తీసుకువచ్చారు. సన్మానసభకు జగన్నాయకులుగారే అధ్యక్షత వహించారు.

ఆ వూళ్ళో ఒక సాంప్రదాయం వుంది. అది కావడానికి కమిటీహైస్కూలే అయినా, స్థలదాతలు జగన్నాయకులుగారి పూర్వీకులుగనుక అక్కడ ఏ సభ, సమావేశం జరిగినా జగన్నాయకులుగారో, వారి సుపుత్రులో అధ్యక్షపీఠం అలంకరించడం ఆచారమయింది. పైగా చిదంబరం మేష్టరుగారి షష్టిపూర్తి సన్మానానికి నడుంబిగించి, కొంతమందిని కూడగట్టుకొని, తన స్వంత పనిలాగే కృషిచేస్తున్నందున జగన్నాయకులుగారే అధ్యక్షపీఠం అలంకరించడం అందరికీ ఆమోదయోగ్యమైంది.

చిదంబరంగారి ప్రతిభా, పాండిత్యాలను ప్రశంసిస్తూ యిద్దరు, ముగ్గురు కవివరేణ్యులు, తెలుగు పండితులూ పంచరత్నాలను చదివారు. మరికొందరు సన్మానపత్రాలను చదివారు. చిదంబరంగారివద్ద చదువుకొన్న పూర్వవిద్యార్థులు మేష్టరుగారి నిరాడంబరత గురించీ, ప్రేమానురాగాల గురించీ, చదువు చెప్పడంలో వారికిగల ప్రత్యేక ప్రజ్ఞా, ప్రాభావాల గురించీ, నిస్వార్థసేవానిరతి గురించీ మాట్లాడారు. చిదంబరంగారి వద్ద చదువుకోబట్టే, వారి జీవితాలను తీర్చిదిద్దబట్టే తామంత ఉన్నతస్థితికి జీవితంలో రాగలిగామని ఉగ్గడించారు.

చిదంబరం గారి సమకాలీనులూ, ఊళ్లోని 'పెద్దలు' చిదంబరంగారిగురించి చెప్పడం తగ్గించి, జగన్నాయకులుగారిని పొగడడం ఆరంభించారు. జగన్నాయకులుగారు పూనుకోకపోతే యీ షష్టిపూర్తి సన్మానం అంత పెద్దఎత్తున, అంతబాగా జరిగివుండదనీ, తాలూకాలో మంచిపని ఐనా, మరోపనియైనాజరిగించడానికి ఆయనకు ఆయనే సాటి అనీ, జగన్నాయకులుగారు పూనుకోకపోతే చిదంబరంగారైనా మరొకరైనా అలాగ నివురుగప్పిన నిప్పులాగ పడివుండవలసినదేననీ చెప్పారు. వారు మాట్లాడుతున్నంతసేపూ అది జగన్నాయకులుగారి సన్మానసభేమోననిపించింది కొత్తవాళ్ళకి.

జగన్నాయకులుగారు గూడా ఒక అరగంట మాట్లాడారు. ఏ సభలో ఆయన మాట్లాడినా తమ పూర్వీకులు చాలా గొప్పవారనీ, చాలా మంచి పనులు చేశారనీ, ఆ పరంపరలో వస్తున్నతాను మంచిపనులు చెయ్యకుండా వూరికే కూర్చోలేననీ చెప్పడం ఆయనకు అలవాటు. జగన్నాయకులుగారి ఉపన్యాస ధోరణిలో మరో విశేషం వుంది — ఆయన ఎక్కడ మొదలుపెడుతున్నారో ఎక్కడ అంతం చేస్తారో, ఏ విషయం మొదలు పెట్టి అందులో ఎన్ని కలగాపులగంచేసి చేస్తారో తెలియకుండాచెప్పి అలసిపోయినట్టుఆగిపోయి, అటూయిటూ చూడగానే కరతాళధ్వనులు వినిపిస్తాయి. ఆయనే చెయ్యెత్తి కరతాళధ్వనులు సద్దుమణిగించి మళ్ళీ ఉపన్యాసం అందుకుంటారు. ఆయన ఎన్నిగంటలు మాట్లాడినా, శ్రోతలను ఆయనేం చెప్పారని అడిగితే ఏం మాట్లాడాడో ఎవరూ చెప్పలేరు. అలాగ మాట్లాడడం కూడా ఒక కళే. ఆ కళను ఆధారంచేసుకునే జగన్నాయకులుగారు మాట్లాడిన అరగంట అధ్యక్షోపన్యాసంలో చిదంబరంగారి గురించి ఏమీ చెప్పలేదు.

జగన్నాయకులుగారు తమ ఉపన్యాసం యింక ముగించబోతారనగా ఆయనకొక టెలిగ్రాం వచ్చింది. ఎవరో అభిమానులు సభ జయప్రదంగా జరగాలని కోరుతూ టెలిగ్రాం యిచ్చి వుంటారనుకొన్నారు. సభలో చాలామంది, జగన్నాయకులుగారు టెలిగ్రాం కూడబలుక్కొని చదివి జేబులో పెట్టుకున్నారు. అయన గంభీరమైన వ్యక్తి గనుక టెలిగ్రాం విశేషాలేమీ వివరించలేదు. అది ఆయన స్వంత విషయం గనుక సభవారికి చెప్పవలసిన అవసరం కూడా ఆయనకు లేదు. త్వరలోనే ఉపన్యాసం ముగించి కూర్చున్నారు.


ఆ తర్వాత సన్మానసంఘ కార్యదర్శి నివేదికచదివాడు. కొందరు దాతల పేర్లు కూడా చదివాడు. తదుపరి చిదంబరంగారికి జగన్నాయకులుగారు శాలువా కప్పి సత్కరించి, ఆరువేల నూటపదహార్లు పర్సు చిదంబరంగారికి సమర్పించారు. పర్సు చాలా ఉబ్బెత్తుగానే వుంది. చిదంబరంగారు దానిని స్వీకరించి చొక్కా పక్కజేబులోపెట్టుకుని, తనకు జరిగిన సన్మానానికి, సత్కారానికీ, అభినందన పరంపరకూ ఉచిత రీతిని, సవినయంగా సమాధానం చెప్పారు. ఆ

తర్వాత హైస్కూలు విద్యార్థుల నాటి కతో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

సుబ్బమ్మగారు నాటికను తాను చూడ ననీ, యింటికి వెళ్ళిపోతాననీ అందే ముందుగానే కారులో జగన్నాయకులు గారు యింటికిపంపించివేశారు. సుబ్బమ్మ గారు యింటికి వెళ్ళేముందు చిదంబరం గారిని పర్సు అడిగి తీసుకువెళ్ళిపోదా మనుకుంది గాని అందరిలోనూ అలా అడిగి తీసుకోవడం బాగుండదని అడగ కుండానే వెళ్ళిపోయింది.

రాత్రితొమ్మిది గంటలకు కార్యక్రమం అంతా ముగిసిన తర్వాత చిదంబరం గారిని జగన్నాయకులుగారు తమ కారులో వారి యింటికి తీసుకువెళ్ళారు. చిదంబరంగారు కారు దిగి శలవు తీసు కొని లోపలికి వెళ్ళబోతుంటే జగన్నా యకులుగారు పక్కకి పిలిచి, 'మేష్టారూ, మీకు యిందాక యిచ్చినపర్సులో నూట పదహార్లే పెట్టాము. ఆ పర్సులో పట్ట వనీ, యింటిదగ్గర మీకు యివ్వవచ్చు ననీ, ఆరువేలూ నా దగ్గర వుంచాను. అవి యిప్పుడు మీకు యిచ్చేద్దామను కుంటూంటే మా రెండోఅబ్బాయి దగ్గర నుంచి, బెంగుళూరునుంచి మన సభ జరుగుతూవుంటే టెలిగ్రాం వచ్చింది, అర్జంటుగా పదివేలు పంపమని అంత డబ్బు ప్రస్తుతం నాదగ్గర లేదు. మీకు అభ్యంతరం లేకపోతే యీ ఆరువేలూ అందాక పంపి, మీకు నెల్లాళ్ళలో యీ డబ్బు యిచ్చేస్తాను. మీకు నోటు వ్రాసి యివ్వమంటే యిస్తాను. మీరు మరో విధంగా భావించకండి; ఏమంటారు" అన్నాడు.

చిదంబరంగారికి ఏమనాలో తెలియ లేదు. ఇంత ఘనంగా సన్మానం జరిగిం చిన వ్యక్తి, యీ సన్మానానికి కారణ భూతుడైనవాడు, ఏదో టెలిగ్రాం




వచ్చింది, డబ్బు కావాలంటే తనెలా కాదనగలడు? అయినా జగన్నాయకులు గారివంటివారిని కాదనే శక్తి ఎవరికుంది? కాదనడానికైనా డబ్బు ఆయన చేతుల్లో నేవుందిగాని, తన పర్సులో లేదుగా. నోటు వ్రాయించుకుని మాత్రం తనేం చేయగలడు? అందువల్ల చిదంబరంగారు 'అలాగే చెయ్యండి, తమ దయ' అని మాత్రం అనేసి యింట్లోకివెళ్ళిపోయారు.

ఆ రోజు రాత్రి ఆరువేలరూపాయలు ఒక్కసారిగా కళ్ళజూసి డబ్బంతా లెక్క పెడదామనుకొన్న సుబ్బమ్మగారికి చిదం బరంగారు చెప్పినది విని నోటమాట రాలేదు. కొంతసేపు పోయిన తర్వాత కోలుకొని తన భర్త అమాయకత్వాన్ని, లోకువను, చేతగానితనాన్ని ఎన్ని తిట్లాలో అన్ని తిట్టింది. పర్సులో డబ్బు అక్కడే ఎందుకు లెక్క బెట్టుకోలేదని అడిగింది. పర్సు తనచేతికి ఎందుకు యివ్వలేదని ప్రశ్నించింది. శాలువలూ, పువ్వుల దండలూ, పంచరత్నాలూ పట్టుకొని ఆ రాత్రే జగన్నాయకులుగారి యింటికి వెళ్ళి యిచ్చెయ్యమంది. చిదంబరంగారికి మరో పది సన్మానాలయినా, సుబ్బమ్మ గారి దూషణ విలువకు సరిపోనంతగా ఆమె భర్తను నిందించి, ఎత్తిపోసింది.

తండ్రి అసమర్థతకు అసహ్యించు కొన్న భాస్కర్రావు పర్సులో వున్న నూటపదహారు రూపాయలు తన రైలు ఖర్చులకైనా వచ్చినాయని సంతృప్తి పడి, ఆపర్సు తీసుకుని ఆరాత్రే బయలు దేరి వెళ్ళిపోయాడు.